

# వలయం

గోవిందరాజు శ్రీనివాసమూర్తి

రాత్రి పన్నెండు దాటింది.

రమణ ఇంకా ఇంటికి రాలేదు.

సింహాచలంగారికి కోపం తారస్థాయిలో ఉంది. పక్కమీద చిరాగ్గా అటూ ఇటూ కదిలారు.

“వీడింకా రాలేదల్లే ఉందే.”

భార్య సావిత్రమ్మ 'ఊ' అని అటు తిరిగి పడుకుంది.

ఆమెకూ కొడుకు ఇలా అర్ధరాత్రిళ్ళు ఇంటికి రావటం అలవాటే.

సింహాచలంగారు మాత్రం కోపంతో రోజురోజుకీ దిగజారిపోతున్నారు. రమణ సంగతి ఆయనకు అంతుబట్టటం లేదు. వాడి 'తిరుగుళ్ళకు' ఒక అడ్డు అంటూ వేయలేకపోతున్నారు. నాటకాలంటాడు, సినిమా లంటాడు, క్లబ్బు

లంటాడు. ఒకపేమిటి— 'ఇందుగల డందు లేడని సందేహంబు వలదు...'

వీధితలుపు చప్పుడైంది.

భార్య లేవబోతూంటే పెద్దని వారించి ఆయనే తలుపు తీసేందుకు వెళ్ళారు.

రమణ లోపల అడుగుపెడుతూంటే గుప్పున సిగరెట్ వాసన కొట్టింది. ముక్కు మూసుకున్నారు సింహాచలం గారు.

"ఏరా, ఇల్లూ వాకిలీ అక్కర లేదన్న మాట?"

ఏదో గోడకు చెబుతున్నట్టుగా రమణ పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

అగ్గిమీద ఆజ్యం పోసినట్లయింది ఆయనకు. విసురుగా పడగ్గదిలోకి వచ్చారు.

"బాగా తయారు చేశావ్!" అని భార్యమీద విసుక్కున్నారు.

ఆమె ఈ వాక్యం వింటో లేదోగాని దుప్పటి ముసుగుతన్నింది 'పొద్దునే మాట్లాడుకుందాంలే,' అన్నట్టు.

విసుగ్గా పక్కమీద వాలిపోయాడు సింహాచలంగారు.

పొద్దున పర్సులో పెట్టుకున్న పది రూపాయల కాయితం కనబడకపోయిం దగ్గర్నుంచీ ఆయన అలాగే ఉన్నారు. రమణ ఆ వెళ్ళటం వెళ్ళటం ఇప్పుడే ఇంటిముఖం చూసింది.

ఇది కొత్తగా జరిగే సంఘటన నేం కాదు. ఏమరుపాటుగా చొక్కా వంకెకు తగిలించారో, పర్సులో డబ్బులు ఇట్టే మాయమై పోతూంటాయి. మాయమై పోయిన రోజున రమణ ఏ అర్ధరాత్రో గాని ఇంటికి చేరడు.

"ఏరా, జేబులో డబ్బేమయిం."అని నిలదీస్తే—

"ఏమో, నాకు తెలియ,"అంటాడు ధీమగా.


ఇహ వా ణ్ణేమంటారు? ఏం చేస్తారు?

ఇవాళ పదిరూపాయలు కనుపించక పోయేసరికి ఆయనకు కోపంతోబాటు దుఃఖంకూడ వచ్చింది. నిన్ననే ఆయన ఎవరో స్నేహితునివద్ద నలభై రూపా యలు పట్టుకొచ్చారు. పాతికపైగా ఇంటి ఖర్చుకే నిన్ననే సరిపోయింది. మిగతా దాంట్లో పది మాయమయి నై— నెలాఖరుదాకా మరెట్లా?—దుఃఖంకాక మరేమిటి?

బాధ్యత కించిత్తు తెలీకుండా పైలా పచ్చీసుగా తిరుగుతున్న రమణను చూస్తే ఆయనకు నోటంట మాట రావటంలేదు. చీమలు కూడబెట్టినట్టు తను కూడబెడు తూంటే, ఇట్టే హరించుకుని పోతున్నా దాయె—

ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు సింహాచలంగారికి.

తండ్రికి చేసిన అపచారాలకి ప్రతి ఫలంగా ఆయన పేరు కొడుక్కు పెట్టు కున్నారు. తన తండ్రి ఈ విధంగా 'పగ' తీర్చుకుంటున్నాడేమో!




ఈ తలంపు వచ్చేసరికి భయం వేసింది ఆయనకు.

తండ్రి రమణరావుగారు పండు మీసాలతో ఎదురుగా హుంకారంగా నవ్వినట్లు తోచింది.

'ఏం, నన్ను ఉసురు పెట్టినట్టు గాదా !' ఈ మాటలు నిజంగా ఆయనే అంటున్నారు.

చిన్నప్పుడు తను తండ్రిని ఎంత క్షోభపెట్టాడని !

'వద్దురా నాయనా' అంటే కాలవకు ఈతలకు వెళ్ళలేదూ.

'బడి కెళ్ళరా' అంటే ఎగ్గొట్టి గోవాడ తిరణాళ్ళకు పోలేదూ—కన్యకా పరమేశ్వరీ గ్రంథాలయంలో కొవ్వలి నవలలు చదువుతూ దాక్కోలేదూ—

'జేబులో డబ్బులు ఏమయ్యాయిరా' అంటే 'ఏమో నాకేం తెలీదు' అని బుకాయించలేదూ.

ఆఖరుకు తిరుపతి వెంకటేశ్వరుడికి ముడుపు గట్టి బీరువాలో పెట్టిన ఏడు రూపాయిబిళ్ళలు కూడ తీసుకుని వాడుకోలేదూ—

ఇవిగాక తోటి స్నేహితులవద్ద డబ్బు తీసుకుని అందర్నీ కట్టగట్టి గుమ్మంముందు నిలబెట్టి తండ్రికి వప్పగించలేదూ—

చెప్పుకుంటే సిగ్గు—రోడ్డుమీద సగం కాల్చిపారేసిన సిగరెట్లు ఏరుకుని తాలూకాఫీసులో గానుగచెట్టుకిందకు చేరలేదూ—

బోడితో గానుగ దొర్లించుకుంటూ

ఊళ్ళమ్మట పడిపోయి మూడునాలుగు రోజులకుగాని ఇంటిముఖం చూడకుండా ఉండలేదూ—

ఇవి మచ్చుకి మాత్రం.

ఫలితం ఏమిటి ?

మెట్రిక్యులేషన్ పరీక్ష మూడుమాట్లు తప్పి ఇహ చదవనని మోరాయించి గుమాస్తాగిరీని ఆనందంగా చేపట్టాడాయె.

తనలో ఎన్నోవంతు రమణ – బియ్యే ఫైనల్ ఇంటర్ లోకి కూడ వచ్చాడు గదా !

'నీకన్నా వాడే నయం' అని రమణ రావుగారు అన్నట్టు తోచింది ఆయనకు.

భయంతో గబుక్కున దుప్పటి ముసు గెట్టుకున్నారు సింహాచలంగారు.

* * *

పొద్దున నిద్ర లేవంగానే రమణను పిలిచి "ఏరా జేబులో పదిరూపాయలు తీశావా ?" అనడిగారు.

"ఉహుం, నాకు తెలీదు." అన్నాడు రమణ.

ఠప్‌మని అతడి చంపమీద ఒక దెబ్బపడింది. విస్తుపోయాడు రమణ. కళ్ళంట నీరు తిరిగింది. గిరుక్కున తిరిగి గదిలోకి వెళ్ళిపోయాడు.

రమణమీద చెయ్యి చేసుకోవడం ఇది రెండవసారి మొదటిమాటు మెట్రిక్యు లేషన్ పరీక్ష తప్పినప్పుడు. కాని ఇప్పుడు పరీక్ష తప్పినందుకు గాదు. తన కష్టార్జితం ఇలా తగలేస్తున్నందుకు; అడ్డమైన తిరుగుళ్లూ తిరుగుతున్నందుకు.

ఒకమాటు సింహాచలంగారి స్నేహి తుడు పరమహంస కనిపించి 'ఏమోయ్ నీ కొడుకు ఘనుడోయ్. మొన్న ఎవరో కుర్రదాంతో రిక్షాలో వెడుతున్నాడు.'అని అంటే ఎదటవారికి కనుపించనంతగా తన తల సిగ్గుతో కుచించుకుపోయింది.

నిలదీసి గదమాయించమని సావిత్ర మ్మని పురమాయిస్తే, 'ఎవరో నాటక ములో వేసే అమ్మాయి – రిహార్సల్స్‌కి తీసుకెడుతున్నా' నని బుకాయించాడుట.

'ఛీ, సిగ్గులేని బ్రతుకు' ఆరోజు రమణంటే ఎంత అసహ్యం వేసిందని.


కాని రమణ గదిలోకి వెళ్ళగానే అతడిమీద చెయ్యి చేసుకున్నందుకు చాల బాధకలిగింది సింహాచలంగారికి. బియ్యే చదువుతున్నాడాయె. పైగా కొట్టే వయస్సా అది. ఇరవయ్యో ఏడుకూడ వచ్చిందాయె.

పొద్దున్నే జరిగిన ఈ దృశ్యం సావిత్రమ్మగారు చూడనేలేదు. చూస్తే తనతో యుద్ధకాండ జరిపేదే.

'అదెంతదని; వాణ్ణి వెనకేసుకు రావడంలో మొనగత్తె. వంశోద్ధారకుడు ఈ వక్కడే నాయె!'

ఆ క్షణంలో భార్యంటేకూడ చిరాకు వేసింది ఆయనకు.

సాయంత్రం ఆఫీసునుండి ఇంటి కొచ్చి పేపరు తిరగేస్తూ "రమణ గాని ఉన్నాడా? ఓయ్ !'' అని వంటగదిలోకి కేకేశారు.




భార్య ఇవతల కొచ్చింది.

"మీ ఘనకార్యానికి పొద్దున తిండి కూడ తినకుండా వెళ్ళాడు!" అంది ఆవిడ.

''వాడే తిరిగొస్తాడు, నాలుగు రోడ్లు తిరిగి;'' ఈ మాట మనస్ఫూర్తిగా అన లేదు ఆయన. లోపల చాల 'ఇదై' పోతూనే ఉన్నారు. సావిత్రమ్మగారు ఇంకేం మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పేపరు చూస్తూనే ఉన్నా ఆయన ఆలోచనలు ఎటో పోయినై.

ఒకమాటు ఏం జరిగిందనీ!

ఉద్యోగంలో చేరింతర్వాత గావాలు

– అప్పను ఉద్యోగంలో చేరిన నెలరోజు లకు – అప్పటి కింకా పెళ్ళికాలేదు తనకు. నలభై రూపాయల స్వార్జితం జేబులో పెట్టుకుంటే ప్రపంచాన్నే జయించినంత గర్వంగా ఉన్న ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకు గంగానమ్మ వీధిలోని చంద్ర ముఖి ఇంటినుండి తను బయటకు వస్తూంటే, ఆ రోడ్డుగుండానే వస్తూన్న తండ్రి రమణరావుగారు ఎదురైనారు. కన్నంలో దూరిన దొంగలా పట్టుబడి పోయాడు తను.

చిత్రం !– రమణరావుగారు ఏమీ మాట్లాడలేదు. తలవంచుకుని ఇంటికి వెళ్ళారు. ఇది తన భయం మరీ ఇనుమ డింపజేసింది.

వెంటనే తనకు ఇంటికి వెళ్ళబుద్ధేయ లేదు. సిగ్గుతో దహించుకుపోతూ, ఏదో సాకు ఆలోచించుకుని రాత్రి ఏ పది గంటలకో ఇంటికి చేరి, మెల్లిగా తలుపు తట్టాడు.

తలుపు తీసింది తల్లికాదు – రౌద్రాకా రంలో ఉన్న రమణరావుగారు.

లోపల అడుగుపెట్టగానే దవడ ఠపీమని పేలిపోయింది.

మరుక్షణంలోనే రెండోదవడ; నాలు గయిదు తగిలినై తనకు. ఇక ఏ ముఖం పెట్టుకుని ఇంట్లో అడుగు పెడ తాడు. తల్లి లబో దిబో మన్నా సింహంలా ద్వారంవద్ద నిలబడ్డ రమణా రావుగార్ని చూస్తే భయంతో పదికి పోయి రోడ్డుమీదకు మళ్ళాడు.

ఆ వెళ్ళటం మళ్ళీ తండ్రిని చూసింది తన పెళ్ళినాడే – ఆరునెలల తర్వాత తల్లే వచ్చి పెళ్ళి ఖాయం చేశామని చెబితే, ముందు మోరాయించినా, ఒప్పేసు కుని సరీగా పెళ్ళినాడే తండ్రెదట పడ్డాడు. ఆయన ముఖం అప్పుడు గంభీ రంగానే ఉన్నా, ప్రశాంతంగానే ఉన్నది.

పెళ్ళి ఐన తర్వాత ఇంటిపట్టునే ఉన్నాడతను.

తర్వాత ఏడాది తిరక్కుండానే రమణారావుగారు కన్ను మూశారు.

నాలుగునెలలకు వీడు పుట్టాడు.

ముచ్చటగా తండ్రి పేరు పెట్టు కున్నాడు.

*　　*　　*

తండ్రి పోయిన మూడు నెలలకు బీరువాలు సద్దుతూంటే, ఆయన రాసు కున్న డైరీలు కొన్ని కనుపించినై. చదవకూడ దనుకుంటూనే అక్కడక్కడ చదువుకుంటూ వెళ్ళారు తను.


ఒకపేజీలో ఇలా ఉంది.

'ఇవాళ సింహాచలం పుట్టినరోజు. వాడికి ఏమీ ఇవ్వలేకపోయాను – నా అపేక్ష తప్ప.'

కళ్ళంబ నీళ్ళు తిరిగినై తనకు.

మరోచోట.

'వీడిమీద ఎన్ని ఆశలు పెట్టు కున్నానో – అన్నీ బూడిదపాలు ఐపోయినై. జీవితం అంటే వీడి కేం




తెలుసు. వీడు వృద్ధిలోకి రాడని నాకు తెలుసు.'

ఇది చదువుకుని ఎంత బాధ పడ్డాడు తను.

మరొకచోట తను చదివింది నిజంగా కుదిపివేసింది.

'జీవితంలో మొదటిమాటుగా ఇవాళ సింహాచలంమీద చేయి చేసుకున్నాను. ఒక్కడే కొడుకన్న జ్ఞానం కూడ నాకు లేకపోయింది. కాని ఇంటా వంటా లేని వీడి దురభ్యాసాలకు నాకు వళ్ళు కుతకుత లాడిపోయింది – లాభం లేదు. వీడికి త్వరగా పెళ్ళి చేసేయాలి.

'నిన్నటినుంచీ నిద్రపట్టటం లేదు. వీడు ఇంకా ఇంటికి రాలేదు. ఏమై పోయాడో ఏమిటో. ఎదిగి ఉద్యోగం చేసుకుంటున్నవాణ్ణి చేయి చేసుకుంటే వాడి అహం దెబ్బతినదూ. తప్పు నాదే గాబట్టి, యీ బాధ దిగమింగాల్సిందే. ప్రయోజకుడై, తను తిని నలుగురికీ ఇంత పెట్టగల స్తోమత సంపాదించు కుంటాడని ఎన్ని కలలు కన్నాను. ఎన్ని దేవుళ్ళకు మొక్కుకున్నాను. కాని వాడి బతుకే వాడికి భారంగా తయారవుతున్నది. ఓ వెంకటేశ్వరా! నువ్వే వాణ్ణి కాపాడాలి. పిచ్చి వెధవ – తిండి తిన్నాడో లేదో! —' తన కళ్ళు ఎరుపెక్కినై; ఉన్న కన్నీళ్ళన్నీ కార్చేశాడు. ఆ తండ్రి ఇహ లేడు – ఆ అపేక్షలూ లేవు. ఆయనకు అంత ద్రోహం చేసిన తనకు నిష్కృతి లేదు.

పేపరు మడచి పక్కన పెట్టి కళ్ళు తుడుచుకున్నారు సింహాచలంగారు.

ఇప్పుడు ఆయన బాధల్లా రమణ తిరిగొస్తాడా రాడా అని. ఎంతయినా తన కొడుకు కదూ? వాడికిమాత్రం అభిమానం లేదూ — ఏమో చూడాలి.

కుర్చీలోంచి లేచి చేతులు వెనక కట్టుకుని అటూఇటూ తిరుగుతున్నారు.

* * *

ఆ వెళ్ళినవెళ్ళటం రమణ నాలుగు రోజులైనా ఇంటిముఖం పట్టలేదు — కాలేజీకన్నా వెడుతున్నాడో లేదో?

ఆయనకు వెళ్ళేందుకు మనస్కరించక ఒక స్నేహితుణ్ణి కాలేజీకి పంపారు కనుక్కోమని.

వస్తూనే ఉన్నాట్ట.

'మరి తిండెక్కడ తింటున్నాడు?'

పదిరోజులైనా తిరిగిరాలేదు రమణ.

సింహాచలంగారికి అన్నం సహించటం లేదు; రాత్రిళ్ళు సరిగా నిద్ర పట్టటంలేదు.

ఒకరోజు రాత్రి చూస్తూండగా తెల్లారిపోయింది. అలాగే పక్కమీంచి లేచి రమణను గాలించేందుకు ఊరి మీదకు బయలుదేరారు. ఆఫీసుకు సెలవు చీటీ పంపించేసి, రెండుగంటలశ్రమమీద రమణ వునికి కనుక్కోగలిగారు — ఎవరో స్నేహితుని గదిలో ఉంటున్నాడు.

'ఇంటికి పద' అన్నారు.

'రా' నన్నాడు.

'మీ అమ్మ నీకోసం బెంగపెట్టుకుంది.'

అది నిజమవునో కాదో తెలియదు కాని అంతకన్నా నిజంగా బెంగపెట్టుకున్నది ఆయనే.

ఏమనుకున్నాడో ఏమో మారు మాట్లాడకుండా తండ్రి ననుసరించి ఇంటికి వచ్చేశాడు రమణ.

ఇంటికి వచ్చింతర్వాత అతడి తరహా మరోవిధంగా మారిపోయింది.


ఇల్లు కదలడు. స్నేహితు డెవరన్నా వచ్చి అలా పోదాం రమ్మంటే 'ఎందుకు, ఇక్కడే మాట్లాడుకుందాం' అంటాడు.

ఈ పద్ధతి సింహాచలంగారికి బాగా నచ్చింది. ఇప్పుడు పర్సులో డబ్బు కూడ మాయం కావటంలేదు. ఆయన మన స్సెంతో హాయిగా ఉంది.

రమణ కాలేజీకి వెడుతూనేఉన్నాడు; వస్తూనేఉన్నాడు. పరీక్ష లయిపోయినై; ఇక రెండునెలలు సెలవులు.

ఒకరోజు నెలజీతం తీసికొచ్చి ఏమరుపాటుగా చొక్కా వంకెకు తగిలించారు. కాస్త బడలికగా ఉన్నందున పడకకుర్చీలో మేను వాల్చి ఒక కునుకు తీశారు. అప్పటికి రమణ వరండాలో పేపరు పుచ్చుకుని తిరుగుతున్నాడు.

రాత్రి భోజనం చేసేముందు ఏదో గుర్తుకువచ్చి జేబులో పర్సు చూసుకున్నారు. పంద రూపాయలు తక్కువగా ఉన్నై. అదుర్దాకొద్దీ రెండో జేబు




కూడ చూసుకున్నారు_ఉహుం, లేవు. రమణకూడ ఇంట్లో లేడు.

ఆ రాత్రి పన్నెండయినా రమణ జాడలేదు.

ఊళ్ళో రమణ స్నేహితుల్ని విచారించినా జాడ తెలియలేదు _

సింహాచలంగారికి వంటిమీద తేళ్లూ జెర్రులూ పాకినై.

'ఆ ముండకూడ పోయుంటుంది_ ఛీ.' అనుకున్నాడు.

ఆ నిముషంలో అతడు ఎదురుగా ఉంటే ఏం చేసేవారో మరి!

రమణ కనుపించని బాధకన్నా వందరూపాయలు పోయినబాధ ఎక్కువగా ఉంది ఆయనకు.

ఒకరోజు రాత్రి తండ్రి ఫొటోకేసి తదేకంగా చూస్తూవుంటే ఫొటోలోని రమణరావుగారు ఫక్కున నవ్వినట్టు అనిపించింది ఆయనకు.

'నవ్వకు నాన్నా. నవ్వకు; ఇప్పటికే జీవితం అంటే విసిగిపోయాను. చాలినంత పగ తీర్చుకున్నావ్. ఇహ నన్నొక ఒడ్డుకు చేర్చు నాన్నా! మెదడు ముడించిన రోజుల్లో భవిష్యత్తును చాల తప్పుగా ఊహించాను. ఏవో చాల ఆశలను నాలో నిర్మించు

కున్నాను. ఆ ఆశలు ఫలించాలంటే కృషి కావాలి. ఆత్మవిశ్వాసం కావాలి. అక్కడే నేను బలహీనుణ్ణయిపోయాను. ఆశించిన ప్రతిదీ అవగతం చేసుకునే శక్తి లేకనే ఓడిపోయాను. నా బ్రతుకే వాడికి ఇవ్వకు. వాడిని దారి మళ్ళించేశక్తి నీలోనే ఉన్నది. నన్ను మనస్పూర్తిగా క్షమించు. ఇహ నీలో నేను కలిసిపోయేందుకు ఆట్టే కాలం లేదు. కాని మళ్ళీ నీ ముఖం చూసేందుకు వాణ్ణి మనిషిగా నిలబెట్ట గలిగిన ఆత్మసంతృప్తి నాలో కలగాలి. అందుకే ఇంకా జీవితంమీద మమకారం పెంచుకుంటున్నాను. కాని ఇప్పుడు అది వృధా అనిపిస్తున్నది...'

ఫొటోలో నవ్వు ఇప్పుడు అంత ర్థానమైంది

పక్కనే ఉన్న వెంకటేశ్వరుడి పటం కేసి తిరిగాడు. 'తండ్రంతవాడివి స్వామీ! అజ్ఞానంలో అపచారం చేశాను. క్షమించు. నీ ముడుపు ఎక్కడా పోదు. స్వయంగా వచ్చి దాఖలు చేసు కుంటాను' అనుకున్నారు.

కాని వారి మనసు ఇంకా తేలిక పడలేదు.

*　　　*　　　*

రెండునెలల తరువాతకూడ రమణ ఇంటికి తిరిగిరాలేదు. కాని ఒక ఉత్తరం వచ్చింది.

''నాన్నకు,

రమణ నమస్కరించి వ్రాయునది: నేను బియ్యే పాసయినట్టు మీరు ఇదివరకే పేపర్లో చూచివుండవచ్చు. అందులోనూ మొదటితరగతిలో ఉత్తీర్ణుడనైనందుకు నాకు మరీ గర్వంగా ఉంది.

వందరూపాయలు మీనుండి, మీకు తెలియకుండా తీసుకుని పరారీ అయి నందుకు చాలా సిగ్గు పడుతున్నాను. మీకు బాధ కలిగించినందుకు క్షమించ గోర్తాను.

స్నేహితులు నలుగురిలోనూ ఒక డుగా బతికేందుకు చేసిన ప్రయత్నంలో మిమ్మల్ని ఖోధ పెడుతున్నానని తెలిసి కూడ గత్యంతరం లేక దొంగచాటు ప్రవృత్తి అలవాటయిపోయింది. స్నేహంకూడ డబ్బుతో కూడుకున్న పనే. ప్రతి చిన్న అవసరానికీ స్నేహితుల మీద ఆధారపడకుండటం నన్న నీచమైన పని నేను చేయలేకపోయాను. అసలు అన్నీ తెలిసికూడ మీనుంచి మీకు తెలియ కుండా డబ్బు తీసుకోవటం అలవాటయి



పోయింది. నాన్నవి కాబట్టి ఏనాటికన్నా క్షమించక పోరని ఒక ధీమా ఏర్పడింది.

కాని ఈ అలవాటు ఎంతకాలమని?— నా దోవ నేను చూసుకునేందుకు నిరంతరం కృషి చేశాను. డిగ్రీ లేనిదే శ్రమ పడేందుకు కూడ ఇష్టపడని ఈ వాతావరణంలో ఆ డిగ్రీకోసం పడిన కష్టం ఫలించింది. ఇహ నాకై నేను నిలబడే శక్తి కలిగించి— మద్రాసులోనే ఒక మంచి కంపెనీలో ఉద్యోగం దొరికింది. త్వరలోనే మీ ఋణం తీర్చుకునేందుకు ప్రయత్నిస్తాను. నన్ను క్షమించమని మరీమరీ కోరుతున్నాను. అమ్మకు నా నమస్కారములు.

ఇట్లు

మీ రమణ

సింహాచలంగారు తృప్తిగా నిట్టూర్చారు. ఆయనమనసు ఎంతో తేలిగ్గా ఉంది.

కాని ఈ హాయిని తనతండ్రికి కలిగించలేకపోయానే అన్న తలపు వచ్చినప్పుడల్లా సిగ్గుతో కుంగిపోతూనే ఉన్నారు సింహాచలంగారు.